కోలాహలంగా అక్కయ్యపాలెం పరస

- ముగ్గురమ్మవార్లు, వెంకన్న, సీతారాములకు విశేష పూజలు
- జనంతో కిక్కిరిసిన వీధులు
- కళకళలాడిన దుకాణాలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


అక్కయ్యపాలెం పరసలో దుకాణాల వద్ద జన సందడి

సీతంపేట: అక్కయ్యపాలెం సీతారాముల పరస మహోత్సవం ఆదివారం కోలాహలంగా సాగింది. జగన్నాథపురంలో కొలువైన కుంచుమాంబ, ముత్యమాంబ, భూలోకమాత, వేంకటేశ్వర స్వామి, సీతారాముల పరస సందర్భంగా ఆలయాలను, పరిసరాలను విద్యుత్‌దీపాలు, పూల దండలతో చూడముచ్చటగా అలంకరించారు. ప్రజలు పెద్ద ఎత్తున పరసకు తరలి రావడంతో జనసందోహంతో వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. గౌరీ సేవా సంఘం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డ్యాన్స్ బేబీ డ్యాన్స్, సేవగరిడీలు, భజన చెట్టు, కోలాటం, విద్యుత్ దీపాలంకరణ, పరస సందడితో మూడు గుళ్ల ప్రాంతం కళకళలాడింది. పరసలో భాగంగా ఉదయం అమ్మవార్లు, వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, జలాభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లకు మొక్కులు చెల్లించారు. ముఖ్య అతిథులుగా 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, శ్రీనివాస్ దంపతులు, 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, టీడీపీ ఉత్తర ఇన్‌చార్జి చిక్కాల విజయ్‌బాబు అమ్మవార్లకు పూజలు చేసి, భజన చెట్టు వద్ద దీపాలు వెలిగించి పరసను ప్రారంభించారు. పరసలో ఏర్పాటు


పరసలో జన సందోహం

చేసిన గృహాలంకరణ సామగ్రి, మహిళల అలంకరణ సామగ్రి, పిల్లల ఆట వస్తువులు, తినుబండారాల విక్రయాల దుకాణాల వద్ద కొనుగోళ్లతో సందడి నెలకొంది. రకరకాల ఆట బొమ్మల దుకాణాల వద్ద పిల్లలు సందడి చేశారు. గౌరీ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు పి.ఎస్.జె.వి.ప్రసాద్(పోర్టు), అధ్యక్షుడు కొయిలాడ వేణుగోపాల్,


భజన చెట్టు వద్ద తలపై బిందెలతో కోలాటమాడుతున్న మహిళలు

చైర్మన్ రాపేటి మాలినాయుడు, ఉపాధ్యక్షుడు మాదేటి శ్రీనివాసరావు, డిప్యూటీ ప్రెసిడెంట్ మళ్ల త్రినాథరావు, కార్యదర్శి ఆడారి పారుపల్లి రవి, కోశాధికారి పిల్లా గోపి, పాలక వర్గ సభ్యులు పెంటకోట శ్యామ్, కర్రి బాబ్జి, పెంటకోట ఉమ, కర్రి శంకర్, కన్నా, కాండ్రేగుల గణేష్, రాజగిరి అప్పలరాజు పరస ఉత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సజావుగా కానిస్టేబుల్ పరీక్ష


బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో పరీక్ష కేంద్రం వద్ద విధుల్లో పోలీసులు


ద్వారకానగర్‌లో పరీక్ష కేంద్రం వద్ద పర్యవేక్షిస్తున్న సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో కానిస్టేబుళ్ల నియామకాలకు సంబంధించి ఆదివారం నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష సజావుగా జరిగింది. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని శ్రీనవోదయ జూనియర్ కళాశాల, ద్వారకానగర్‌లోని కాశ్యప్ జూనియర్ కళాశాలల వద్ద ద్వారకా జోన్, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ల సీఐలు సింహాద్రినాయుడు, శ్రీనివాసరావు పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల్లోకి వెళ్తున్న అభ్యర్థుల హాల్ టికెట్లు, గుర్తింపు కార్డులను స్వయంగా పరిశీలించి అనుమతించారు. ప్రతీ అభ్యర్థిని పోలీస్ సిబ్బంది తనిఖీలు చేసి పరీక్ష కేంద్రాల్లోకి పంపించారు. కాపీయింగ్ తదితర అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా పరీక్ష జరిగేలా పక్కాగా చర్యలు చేపట్టారు.

ద్వారకా, ఫోర్త్‌టౌన్ పీఎస్‌ల పరిధిలో..

ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధి శ్రీనగర్‌లోని శ్రీకాశ్యప్ డిగ్రీ కళాశాలలో 432 మంది, రాజేంద్రనగర్ శ్రీకాశ్యప్ జూనియర్ కళాశాలలో 250 మంది, రాజేంద్రనగర్ ప్రిజమ్ డిగ్రీ, పీజీ కళాశాలలో 696 మంది, సీతంపేట శ్రీవిశ్వ జూనియర్ కళాశాలలో 500 మంది, ద్వారకానగర్ బీవీకే కళాశాలలో 500 మంది అభ్యర్థులు ప్రిలిమినరీ పరీక్ష రాశారు.

- ఫోర్త్‌టౌన్ పీఎస్ పరిధి బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని శ్రీనవోదయ జూనియర్ కళాశాలలో 250 మందికి 23 మంది హాజరు కాలేదు. కైలాసపురం


మాధవధార కేంద్రంలో పరీక్ష రాసి బయటకు వస్తున్న అభ్యర్థులు

రోడ్డు తాటిచెట్లపాలెంలోని వీవీఆర్ కనకమహాలక్ష్మి డిగ్రీ కళాశాలలో 500 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు.

51వ వార్డులో..

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలోని శ్రీపాద డిగ్రీ కాలేజీలో పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ కేంద్రంలో 300 మంది అభ్యర్థులకు గానూ 272 మంది పరీక్షకు హాజరయ్యారు. మేల్ అభ్యర్థులు 227కు గాను 211 మంది, ఫీమేల్ అభ్యర్థులు 73కి గాను 61 మంది పరీక్ష రాశారు. కాలేజీ వద్ద పోలీసులు ఆరుగురు బందోబస్తులో ఉన్నారు.

క్లుప్తంగా

ఘనంగా మాతా అమృతానందమయి వేడుకలు


లలితా పారాయణం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: మాతా అమృతానందమయి దేవి విశాఖపట్నం విచ్చేసి ప్రజలను, భక్తులను ఆశీర్వదించి పది వసంతాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా మాతా అమృతానందమయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం గురుద్వారా దరి కావేరి కల్యాణ మండపంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం లలిత సహస్ర స్తోత్ర నామ పఠనం, కార్యక్రమ పరిచయం, అర్చన నిర్వహించారు. అనంతరం పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చట్టపల్లి చలమయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మట్టపల్లి హనుమంతురావు భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతంపేట: అక్కయ్యపాలెం సెక్షన్ 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనుల్లో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు హెచ్‌పీ పెట్రోల్ బంక్, అబిద్‌నగర్, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, రిజిస్టర్ ఆఫీస్, షాదీఖానా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సీతంపేట: అబిద్‌నగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా యు.కిశోర్, ఉపాధ్యక్షుడిగా ఎస్.వి.ఆర్.ప్రసాద్, కార్యదర్శిగా జఫరుల్లాఖాన్, సంయుక్త కార్యదర్శిగా ఎన్.ఎస్.మూర్తి, కోశాధికారిగా ఎం.వెంకటరావు, కార్యవర్గ సభ్యులుగా మురళీరాజు, సత్యనారాయణ, వి.ఆర్.కె.రాజు, నటరాజ్, అరుణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, గీత ఎన్నికయ్యారు.

అభాగ్యుడికి అండగా మమత ట్రస్ట్


నిస్సహాయ స్థితిలో ఉన్న వ్యక్తిని కేజీహెచ్‌కు తరలిస్తున్న మమత తదితరులు

అల్లిపురం: దయనీయ స్థితిలో రోడ్డుపై పడి ఉన్న ఓ అభాగ్యుడికి మమత చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. కంచరపాలెం రామమూర్తి పంతులపేట రామాలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తి నడుముకు దెబ్బ తగిలి కదల్లేని స్థితిలో ఉన్నట్లు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్.. ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యురాలు ఎల్లేటి మమతకు సమాచారం అందించారు. దీంతో ఆమె ఆదివారం అక్కడికి చేరుకుని ఆ వ్యక్తికి సిబ్బంది సహకారంతో సపర్యలు చేశారు. దుస్తులు మార్చి, భోజనం పెట్టిన అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

శాశ్వత చట్టానికి డిమాండ్

సీతంపేట: పదేళ్ల కాలపరిమితి కలిగిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని శాశ్వత చట్టంగా మార్చాలని దళిత హక్కుల సమాఖ్య అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23తో చట్టం గడువు ముగుస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించి కాలపరిమితి తొలగించి శాశ్వత చట్టం చేయాలని కోరారు.

అలరించిన సంగీత విభావరి

మద్దిలపాలెం: కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. సంగీత సాయి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ గాయనీ, గాయకులు చక్కని గీతాలతో మైమరిపించారు.

మాధవధార తోటలో వనభోజనాలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

మర్రిపాలెం: వైజాగ్ సౌండ్స్ అండ్ లైటింగ్ డెకరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 51వ వార్డు మాధవధార తోటలో వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పాల్గొని అసోసియేషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాస్, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, ఉషశ్రీ తదితరులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ధన్యవాదాలు


రాయుడు శ్రీనివాసరావు

తాటిచెట్లపాలెం: రాష్ట్ర శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తన పదవీ కాలం పొడిగించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాయుడు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. డిసెంబర్‌తో ముగిసిన డైరెక్టర్ల పదవీ కాలాన్ని మరో రెండేళ్లు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో ఆదివారం రాయుడు శ్రీను ఒక ప్రకటనలో సీఎంకు ధన్యవాదాలు తెలియజేశారు.

నేటి నుంచి లలితా పీఠంలో 74వ బ్రహ్మోత్సవాలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఈవో శశిభూషణ్, రమేష్‌శర్మ, కృష్ణసేన్ తదితరులు

సీతంపేట: కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి వారి 87వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23 నుంచి ఫిబ్రవరి 5 వరకు విశేష పూజా కార్యక్రమాలు, చతుర్ద శాహ్నిక అష్టముఖ గండ భేరుండ జ్వాలా నారసింహ సుదర్శన మహాయాగం నిర్వహించనున్నట్లు పీఠం సీఈవో మోచర్ల శశిభూషణ్ తెలిపారు. సంబంధిత కరపత్రాలను ఆదివారం లలితా పీఠం దర్బారు హాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠం వేద పండితుడు మాచవోలు రమేష్‌శర్మ మాట్లాడుతూ స్వామి జన్మదినోత్సవం సందర్భంగా లోక కల్యాణార్థం, ధర్మ రక్షణార్థం విశేష పూజలు, లలితా పీఠం 74వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11 రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 23వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు లలితా పీఠంలో జరగనున్న స్వామివారి జన్మదినోత్సవ సభలో కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి పాల్గొంటారనని చెప్పారు. 26న వసంత పంచమి సందర్భంగా లలితా అమ్మవారికి సరస్వతి అలంకారం, సరస్వతి హోమం, విద్యార్థులకు ప్రసాద వితరణ చేస్తామని తెలిపారు. ఫిబ్రవరి 3వ తేదీ సాయంత్రం లలితాకామేశ్వరుల కల్యాణం, 4వ తేదీ సాయంత్రం లలితా అమ్మవారి గ్రామోత్సవం, 5వ తేదీ ఉదయం కాళీకాలభైరవ ప్రతిష్ట జరుగుతుందన్నారు. ఈ నెల 24 నుంచి 30 వరకు ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామిచే భాగవత సప్తాహప్రవచన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. సమావేశంలో సిద్ధేశ్వరీ పీఠం అడ్వైజర్ మునికృష్ణ, లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం పదిలం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శశాంక్

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్, అపోలో ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అపోలో ఆస్పత్రి హృద్రోగ వైద్య నిపుణుడు డాక్టర్ శశాంక్ చుండూరి, జనరల్ మెడిసిన్ డాక్టర్ వి.ప్రణీత 110 మంది స్థానికులకు వైద్య పరీక్షలు చేశారు. బీపీ, సుగర్ వైద్య పరీక్షలతోపాటు ఈసీజీ నిర్వహించి రిపోర్టులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ శశాంక్ మాట్లాడుతూ రోజూ వ్యాయామం చేయడం, నడవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. బీపీ, సుగర్ ఉన్న వారు తప్పనిసరిగా ఆహార నియమాలు పాటించాలని, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ సలహాలు లేకుండా మందులు వాడరాదని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ శశాంక్, డాక్టర్ ప్రణీతలను వాకర్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్.వి.సుధాకర్, పూర్వాధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య, కోశాధికారి జె.కూర్మారావు, సంయుక్త కార్యదర్శి ఎస్.సీతారామ్, బి.సూర్యనారాయణ మాస్టారు, అపోలో ఆస్పత్రి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ గొంపరాంబాబు వైద్య శిబిరం నిర్వహణకు సహకరించారు.

సమతామూర్తి శ్రీమద్రామానుజాచార్యులు


ప్రసంగిస్తున్న ప్రధానార్చకుడు శేషాచార్యులు

సీతంపేట: ప్రపంచ సమతామూర్తి శ్రీమద్రామానుజాచార్యుల జీవితమే ఒక గొప్ప సందేశమని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధానార్చకుడు గోపి నంబాళ్ల శేషాచార్యులు పేర్కొన్నారు. విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శ్రీమద్రామానుజాచార్యుల విశిష్టతపై ఆయన ప్రసంగించారు. 1017–1137 మధ్య కాలంలో జీవించిన శ్రీమద్రామాజానుచార్యులు విశిష్ట ద్వైతాన్ని ప్రతిపాదించిన గొప్ప తత్వవేత్త, హేతువాది, యోగి అని కొనియాడారు. విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు మాట్లాడుతూ సర్వమత సారం ఒక్కటేనని బోధించి, దాన్ని ఆచరించి ప్రజలకు వివరించిన సమతామూర్తి శ్రీమద్రామానుజాచార్యులు నేటి తరానికి ఆదర్శప్రాయులన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త రాంభట్ల నృశింహశర్మ, దయాల్ సుబ్రహ్మణ్యం, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

అనువాదాల రూపంలో ఉత్తమ సాహిత్యం


పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, సాహితీవేత్తలు

సీతంపేట: ప్రజా జీవన సంఘర్షణ, విధానాలు తెలుసుకోవాలంటే అనువాద సాహిత్యం తప్పక ఆహ్వానించాలని సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు అన్నారు. అనువాద రచయిత పారనంది నిర్మల తెలుగు నుంచి హిందీలోకి అనువదించిన స్పర్శ్ కథల సంపుటి, వీరేశలింగం సమకాలీన్ సమాజ్ పుస్తకాలను ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆయన ఆవిష్కరించారు. రచయిత నిర్మల మాట్లాడుతూ ప్రపంచపు ఉత్తమ సాహిత్యమంతా అనువాదాల రూపంలోనే వెలువడుతోందన్నారు. విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగన సభకు అడపా రామకృష్ణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మేడా మస్తాన్‌రెడ్డి, శిరేల సన్యాసిరావు, సర్వేశ్వర శాస్త్రి, సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉక్కు సంకల్పంతో ప్రజాగర్జన

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమాల్లో భాగంగా ఈ నెల 30న ఉక్కునగరం తృష్ణా మైదానంలో నిర్వహించనున్న ఉక్కు ప్రజా గర్జనను విజయవంతం చేయాలని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ పిలుపునిచ్చారు. గర్జన సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం ఉదయం గంగవరంలో, సాయంత్రం నడుపూరు రామాలయం నుంచి మహా పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ఎలా ప్రైవేటుపరం చేస్తారని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ కోసం ఎంతోమంది ఇళ్లు, భూములు ఇచ్చారని, వారి త్యాగాలను వృథా కానీయమన్నారు.

ఇస్కాన్‌లో పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీ రాధాదామోదరులను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పూజలు చేశారు. హరే రామ హరే కృష్ణ కీర్తనలు, అభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భీమ్‌సేన క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ అర్జున్, భీమ్‌సేన ప్రతినిధులు

సీతంపేట: భీమ్‌సేన వైజాగ్–2023 క్యాలెండర్‌ను ఆదివారం అంబేడ్కర్ భవన్ వద్ద ముఖ్య అతిథి ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ అర్జున్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికి ఏ కష్టం వచ్చినా మేమున్నామంటూ భీమ్‌సేన భరోసా ఇస్తోందన్నారు. భీమ్‌సేన వ్యవస్థాపకుడు రవిసిద్ధార్థ మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేడ్కర్ నిర్దేశించిన బోధించు, సమీకరించు, పోరాడు లక్ష్యాలకు అనుగుణంగా భీమ్‌సేన 8 ఏళ్లుగా పనిచేస్తోందని తెలిపారు. ఈ ఏడాది కూడా బాబాసాహెబ్ ఆశించిన లక్ష్యాలను చేరే విధంగా పనిచేస్తామన్నారు. భీమ్‌సేన అధ్యక్షుడు ఓంకార్ మాట్లాడుతూ అంబేడ్కర్ భావజాలంతో ఉన్న యువత భీమ్‌సేనలో చేరి సంస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భీమ్‌సేన భీమిలి నియోజకవర్గ అధ్యక్షుడు దినకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోరు పరిసరాలు అధ్వానం

- నీరు పట్టేందుకు స్థానికుల ఇబ్బందులు


గౌరీనగర్–సుభాష్‌నగర్ ప్రాంతంలో అధ్వానంగా బోరు వద్ద పరిసరాలు


అశోక్‌నగర్‌లో బోరుకు అడ్డంగా ఉన్న పైపులు

కంచరపాలెం: జీవీఎంసీ 55, 56, 57 కంచరపాలెం, ఊర్వశి కూడలి ప్రాంతాల్లోని తాగునీటి బోరు పరిసరాలు అధ్వానంగా ఉన్నా.. పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఊర్వశి కూడలి గౌరీనగర్, సుభాష్‌నగర్ ప్రాంతాల్లో బోరు చేతి పిడి వద్ద బీటీ రోడ్డు వేయడంతో నీరు పట్టేందుకు ఇబ్బందిగా మారుతోంది. బోరు పరిసరాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడం, బోరును ఆనుకుని నిత్యం చెత్తాచెదారం వేయడంతో దుర్వాసన వెలువడుతోంది. బోరు నీరు పట్టుకునేందుకు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. కంచరపాలెంలోని జాషువానగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో బోర్లను ఆనుకుని నిరంతర తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన మిగులు పైపులను అక్కడే నిర్లక్ష్యంగా వదిలేశారు. పైపులు బోరుకు ఆనుకుని ఉండటంతో నీరు పట్టేందుకు అవస్థ పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

మాఘ మాసోత్సవాలు ప్రారంభం

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై కొలువుదీరిన శ్రీసూర్యనారాయణమూర్తి దేవాలయంలో ఆదివారం మాఘ మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మెట్టపై ఉన్న అలిమేలు మంగమ్మ అమ్మవారి ఆలయంలో అర్చకుడు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో తెల్లవారు జాము నుంచి స్వామికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం ప్రత్యేకంగా నిర్వహించారు. అనంతరం కలశ పూజ చేసి, భక్తులకు దర్శనాలు కల్పించారు. స్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకుడు కేశవాచార్యులు మాట్లాడుతూ ఈ నెల 28న రథ సప్తమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఉంటాయని తెలిపారు. వచ్చే నెల 1న భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, అదే రోజు సాయంత్రం శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నామన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చనసేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్ఠంపజేసి 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, శ్రీకాంతాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

దేవీపురంలో శ్యామా నవరాత్రి ఉత్సవాలు


పూజలందుకున్న రాజశ్యామలాదేవి

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి ఆరాధన పీఠంలో శ్యామానవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజశ్యామల అమ్మవారి సన్నిధిలో తొలుత గోపూజ నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. శ్రీమేరు ఎదురుగా ఉన్న హోమశాలలో సాయంత్రం శ్రీగణపతి సహిత రాజశ్యామలా హోమం నిర్వహించారు.గోపూజ అనంతరం గణపతి, శ్యామాదేవి,అంగ,ఉపాంగ,ప్రత్యాంగ దేవతలకు కలశస్థాపన చేశారు.ఉత్సవమూర్తి రాజశ్యామల దేవికి భక్తులచే క్షీరాభిషేకం, షోడశోపచార పూజ,అష్టోత్తర పూజలు నిర్వహించారు. గురుమాత అన్నపూర్ణమ్మ చేతులుమీదుగా భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. తొమ్మిది రోజుల పాటు శ్రీవిద్యా ట్రస్టు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతాయని గురుమాత తెలిపారు.